


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఆ ఇద్దరూ...

మా డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డిగారు రొటీన్‌కి భిన్నంగా తన జర్నలిజం అనుభవంతో, సంపాదించిన జ్ఞానంతో 'హీరో', 'సొంత ఊరు', 'గంగపుత్రులు', 'రొమేంటిక్ క్రైమ్ కథ'లాంటి చిత్రాలకి కథా మాటలూ రాసుకోవడమేకాక, వాటిని నిర్మిస్తూ, రిలీజ్ బాధ్యతలు కూడా మీద వేసుకునే వ్యక్తి.

ఆయనతో మాట్లాడ్డమే ఒక ఎడ్యుకేషన్. 'భూమి' గురించి సొంత ఊరు, నీరు గురించి గంగపుత్రులూ తీసినట్లే 'కొండ' గురించి 'గిరిరాజు' అనే ఓ కథ చేసి పెట్టుకున్నారు. ఆ కథ వింటుంటేనే నా కళ్ళు చెమరించి, హృదయం అనిర్వచనీయంగా పులకించింది. మొత్తానికి పంచభూతాల కాన్సెప్ట్ ఆయనకి బ్రహ్మాండంగా వర్క్ అవుట్ అవుతూ, ప్రతి చిత్రానికీ 'నంది' పురస్కారాలు పొందుతూనే ఉన్నారు.

మొన్న సిట్టింగ్‌లో ఆయనకి ఓ సినిమా రిలీజ్ అయిన సందర్భంగా డిస్ట్రిబ్యూటర్స్‌తో మాట్లాడి నాకు రెండు అద్భుతమైన విషయాలు చెప్పారు. అవే మన ప్రస్తుత కాలమ్‌కి టాపిక్‌గా మారాయి.

మొదటిది '7 Days in Slow Motion' అనే చిల్డ్రన్స్ ఫిల్మ్, అనేక దేశాల్లో (హంగేరీ, అమెరికా, స్విజ్జర్‌లాండ్ మొదలైన) అవార్డ్ ఫిల్మ్స్‌లో స్క్రీన్ అయి ప్రస్తుతం మన దగ్గర రిలీజ్ అయింది. దానిని '7రోజుల్లో' అని తెలుగులో డబ్ చేస్తే, దర్శకులు ఉమాకాంత్ తుమ్ముగోటి, నిర్మాత బసిరెడ్డిగార్ల కోరిక మీద నేను మాటలూ, పాటలూ రాసాను. ఆ సినిమా మొన్న 4వతారీఖుకి రిలీజ్ ఐంది. దానికి మంచి ఓపెనింగ్స్ వచ్చి పదిహేను వందలు షేర్ వచ్చినట్లు చెప్పారు.

ఇది ఓ అద్భుతమైన వార్త.

అసలు ఆ సినిమాలో మన జనానికి పెద్దగా తెలిసిన కాస్టింగ్ ఎవరూ లేరు. పిల్లల్లో 'తేజ' (ఇంద్రలో చిన్నప్పటి చిరంజీవి) తప్ప. వివేక్ ముష్రాన్, రాజేశ్వరీసచ్ దేవ్ గొప్పనటులే కానీ తెలుగులో ఎవరికీ తెలియరు. ఈ సినిమా పిల్లలూ, పెద్దలూ తప్పకుండా చూడాల్సిన సినిమా.

అంతర్జాతీయ ప్రమాణాల్లో ఉన్న సినిమాలు మనవాళ్ళు ఆదరించరు కాబట్టి కలెక్షన్స్ పడిపోయాయి. అది వేరే విషయం. కానీ ఏమీ తెలియకుండా థియేటర్ మీద బోర్డ్ చూసి జనం ఈ సంఖ్యలో టిక్కెట్లు కొనడం అద్భుతమైన వార్తే.

ఇంక రెండోది. ఒక థియేటర్‌కి భీమవరంలో ఇద్దరే వస్తే, టికెట్ ఇచ్చి ప్రదర్శన మొదలయ్యే టైంకి కూడా ఎవరూ రాకపోవడంతో, థియేటర్ యజమాన్యం టికెట్ కొన్నవాళ్ళని బ్రతిమాలి వాళ్ళ డబ్బులు వాళ్ళకి వెనక్కిచ్చేసి ఇంటికి పంపేసారట.

ఈ వార్త నన్ను ఆకర్షించింది. నా మనసులో ఇదే ఆలోచన, పేడ్ మీద గజి బిజి గీతలు గీస్తున్న, మెదడులో 'ఆ ఇద్దరూ మాత్రం ఎందుకొచ్చి ఉంటారు?' అన్నదే ఆలోచన.

డైరెక్టర్ గారు లంచ్ టైంలో "ఏమ్మా? ఏంటంత ఆలోచన? మన కథ గురించి అయితే అయివుండదు"అని జోక్ చేసారు.

నేను నా మనసులో డౌట్ చెప్పాను.

ఆయన సైకాలజీలు స్టడీ చెయ్యడంలో దిట్ట. కాసేపు ఆలోచించి, అలవాటైన నవ్వు నవ్వేసి "ఎవరి కారణాలు వాళ్ళకి ఉంటాయి పాపం!" అన్నారు.

నేను మాత్రం నా పెన్ అల్లరి చెయ్యదగ్గ ఈ సంఘటన వదిలిపెట్టదలుచుకోలేదు.

మన ప్రముఖ రచయితలు, గురుతుల్యులూ నన్ను క్షమించాలి. ఒకవేళ వాళ్ళే ఈ విషయాన్ని కథావస్తువుగా తీసుకుని కథ రాస్తే.... అని ఆలోచించి ఈ చిలిపి ఊహని మీతో పంచుకుంటున్నాను.

*మహానుభావులు విశ్వనాథ సత్యనారయణగారైతే...*

<u>గ్రహదోషం</u>

సుబ్బరామయ్యకి ఏమియునూ తోచుటలేదు. తన జాతక ఫలం పరిశీలించిన ఎడల తను చేయదలుచుకున్న కార్యం సఫలం అవుజాడయునూ కానరాలేదు. ఏమి సేయవలెనో తోచక కొంత తడవు అటు నిటు తచ్చాడి, తుదకు ఏదేని 'బయోస్కోపు'నకు పోయి కాలక్షేపము చేతామా అని, పై మీద కండువా ధరించి వంటగదిలోని పార్వతమ్మకి సైతము చెప్పకుండానే బయటకి వెడలినాడు.

ప్రదర్శనాలయం వద్ద జనం చెదురుమదురుగనూ లేరు. కానీ బిక్క చూపులు సారిస్తూ ఓ పదునైదు ఏళ్ళ కుర్రవాడు మాత్రం బెంచీ టిక్కెట్టు కొనడానికి వచ్చి నిలబడి కనిపించినాడు. సుబ్బరామయ్య ఆ పిల్లవాడి వెనకగా నిలబడి 'జానకి అలాగు ఎందుకన్నదీ? ఆమెకి తన గ్రహఫలం తెలుసునా? లేక నిజముగ ఆమె పూర్వ జన్మ ఫలము ఆమెకి జ్ఞప్తికున్నదా?'అని పరిపరివిధాల ఆలోచించుచునే, గుమాస్తాకి రొక్కం చెల్లించి టిక్కెట్టు కొనినాడు.

సుబ్బరామయ్య ఆ పిల్లవాడితో కాస్త ఎడంగా నిలబడి సంభాషణ ప్రారంభించినాడు.

"అబ్బాయీ నీ జతగాళ్ళు ఎవ్వరూ నీతో రాలేదా? నువ్వు ఒక్కడివే చిత్రం చూడవచ్చినావేమీ?"

అందుకు ఆ కుర్రవాడు మొకము తిప్పుకునినాడే గానీ సమాధానమీయ ఇష్టపడలేదు.

ప్రదర్శనకి సమయము ఆసన్నమైనది. కానీ ద్వారము తెరువబడలేదు. గుమాస్తా కొద్దిగా సంశయముగా, మరెంతో దీనంగా, ఒక్కింత అపచారభావంతో వీరిని సమీపించి "అన్యథా భావింపక మన్నింపుడు. మేమీ ప్రదర్శనని కేవలం ఇరువురు కొరకు, పెరిగిన ఈ విద్యుత్ ధరలలో నిర్వహించుటకు అశక్తులము కావున, ఆట రద్దు చేయుచున్నాము" అని ఎవడి రొఖ్ఖం వాడికి ఇచ్చేసినాడు.

సుబ్బరామయ్య 'హా హతవిధీ ఆ గ్రహదోషం ఇట్లు ఫలించెనా. నేను మొదలిడు ఏ కార్యమూ నేడు ఫలించదని శాస్త్రములో చెప్పబడెను కదా' అని విస్మయం చెందెను. కుర్రవాడు మాత్రం ఏడ్వదొడంగెను.

"నేను పరీక్ష పాస్ కాలేదని మా తండ్రి తన పాద రక్షముద్రలు నా వీపున పడునట్లు బాదును. కొంత తడవైనా ఆయనకి కళ్ళబడకుండా తప్పించుకోలేకపోతిని!" అంటూ.

సుబ్బరామయ్య నిట్టూర్చి "ఎవరి కారణములు వారికి ఉండును కదా" అని ఇంటి దారి పట్టెను.

●●●

*ప్రముఖ రచయిత శ్రీ కొమ్మూరి సాంబశివరావుగారు అయితే.*

*మూడు ఒకట్లు*

ఫెల్ట్ హేట్, నల్లని సూటుతో ఉన్న ఒక వ్యక్తి సినిమా హాలు వద్ద టాక్సీ దిగి హడావిడిగా లోపలికి వెళ్ళాడు.

కౌంటర్లో కర్క్ అతి దీక్షగా తనమీద వాలుతున్న ఈగల్ని తోలుతూ ఇతన్ని పట్టించుకోలేదు. అతనికి కావల్సింది అదే, హేట్ కొద్దిగా మొహం మీదకి లాక్కుని "మూడు ఒకట్లు నెంబర్ కల టికెట్టు ఇవ్వండి ప్లీజ్!" అన్నాడు.

అతను ఈగల్ని తోలడం ఆపి, కౌంటర్ బయట ఉన్న వ్యక్తి వైపు ఆశ్చర్యంగా చూసి, "ఇంకా మొదటి రెండు టికెట్లే అమ్మలేదు. మీరు నూటపదకొండు దాకా వచ్చారు. ఈ సినిమా పోస్టర్ చూసారా? హీరో భయంకర్ పేరు విన్నారా?" అని పెద్దగా నవ్వాడు.

"నీకు ఇంకో రూపాయి అదనంగా ఇస్తాను. నాకు నూట పదకొండు నెంబర్ టికెట్టు ఇవ్వు" అన్నాడు హేట్ వ్యక్తి.

టికెట్లు ఇచ్చే అతను ఇంకో రూపాయ అదనంగా అన్న మాట వినగానే, కొత్త పుస్తకం తీసి నూట పదకొండు నెంబర్ కల టికెట్ అందించాడు. 'ప్రొద్దుటే రూపాయి లాభం' అని ఆనందించాడు. ఫెల్ట్ హేట్ పెట్టుకున్న వ్యక్తి నాలుగు రూపాయలు చెల్లించి టికెట్టు కొని బయటకొచ్చి త్రిబుల్ ఫైవ్ సిగరెట్టు ప్యాకెట్టులోంచి ఒక సిగరెట్టు తీసి వెలిగించాడు.

సరిగ్గా అరగంటకి క్రిజ్లర్ కారొచ్చి హాలు ముందు పార్కింగులో ఆగింది. డిటెక్టివ్ యుగంధర్ దిగి అటూ ఇటూ చూసాడు.

ఒక బఠాణీలు అమ్మే కుర్రాడూ, సైకిల్ స్టాండ్ దగ్గర వయసు పైబడ్డ వ్యక్తీ, కౌంటర్లో గుమాస్తా కనిపించారు.

యుగంధర్ కౌంటర్ వైపు నడిచి "ఒక బాల్కనీ టికెట్టు ఇవ్వండీ" అన్నాడు.

టికెట్టు క్లర్క్ నూట పన్నెండు నెంబర్ గల టికెట్టు ఇచ్చాడు.

"గుడ్! భయంకర్ సినిమాకి కూడా నూట పన్నెండు మంది వచ్చారనమాట!" అన్నాడు యుగంధర్.

"కాదండీ. మీతో కలిపి ఇద్దరే!" అన్నాడు క్లర్క్.

"మరి నూట పన్నెండు నెంబర్ ఎందుకిచ్చారూ?" యుగంధర్ అడిగాడు.

"ఇంతకు ముందు టికెట్టు కొన్న వ్యక్తి నూట పదకొండు నెంబరే కావాలని పట్టుబట్టాడు సార్" అని క్లర్క్ నసిగాడు.

యుగంధర్ మెదడులో నూటపదకొండు అనే సంఖ్య అంతకు ముందే ఎవరి నోటో విన్నట్లు గుర్తొచ్చింది.

ఉదయం గుడిలో ఒక బామ్మగారు తన మనవరాలితో "నూట పదకొండు ప్రదక్షిణాలు చెయ్యవే నువ్వు అనుకున్నది అవుతుంది" అనడం యుగంధర్కి గుర్తొచ్చింది.

ఇందాక పెట్రోల్ బంక్లో ట్యాంక్ ఫుల్ చేయిస్తుంటే "నూటపదకొండుకి డీజిల్... త్వరగా కొట్టు సార్ తొందర్లో ఉన్నట్టున్నారు" అని బంక్ ఓనర్ అనడం గుర్తొచ్చింది.

ఉదయం తను డిక్కీలో చూసిన శవం మీద నూటపదకొండు నెంబరు వేసి ఉండటం గుర్తొచ్చింది.

అతనింక ఆలశ్యం చెయ్యలేదు. "ఆ నూట పదకొండు ఎక్కడున్నాడు? సారీ ఆ నూటపదకొండు సీటు నెంబరు కొన్న అతను ఎక్కడున్నాడు?" అడిగాడు ఆత్రుతగా.

"ఆట మొదలయ్యే టైంకి వద్దామని చుట్టు పక్కల ఏదైనా హోటల్కి వెళ్ళి ఉంటాడు సార్" అన్నాడు టికెట్ల క్లర్క్.

యుగంధర్ 'ఛ' అని వెనక్కి తిరిగి మెట్ల దగ్గర సిగరెట్ పీక చూసి ఆగిపోయాడు. ఎవరికీ అనుమానం రాకుండా, ప్యాంట్ జేబులోంచి గ్లౌజెస్ తీసి వేస్కుని, ఒంగి సిగరెట్ పీకని తీసి జేబులో వేసుకున్నాడు.

మెడ దగ్గర చల్లగా తగిలింది.

"జాగ్రత్తగా విను. నీ మెడ దగ్గర పిస్తోలుంది. చేతులు కూడా ఎత్తకు. కదిలితే కాల్చి పారేస్తా. అలాగే మామూలుగా నడుస్తూ వచ్చి ఆగి వున్న నల్ల అంబాసిడర్ కార్లో కూర్చో" అని వినిపించింది.

యుగంధర్ కనుగుడ్లు మాత్రం తిప్పి పక్కనున్న వ్యక్తి స్త్రీ అని గమనించాడు.

ఆమె పలుచని సిల్క్ చీర కట్టుకుంది. టాల్కం పౌడర్ వాసన్ అతని ముక్కుపుటాలకి సోకుతోంది. అవయవ సౌష్టవాన్ని బట్టి ముప్పై ఏళ్ళలోపు ఉంటుందని అంచనా వేసాడు.

అతను నడుస్తూ రెయిలింగ్ మీద పేరుకుపోయిన దుమ్ములో 'ఎక్స్' గుర్తుపెట్టాడు. ఆ గుర్తు రాజుకి మాత్రమే అర్ధమవుతుంది. యుగంధర్ ప్రమాదంలో ఉన్నాడనడానికి అది గుర్తు. రాజు తప్పకుండా అక్కడికి వస్తాడని యుగంధర్‌కి తెలుసు.

ఈ నూట పదకొండుకీ, పక్కనున్న అమ్మాయికీ ఏవిటి సంబంధం? అని యుగంధర్ ఆలోచిస్తున్నాడు. ఆమె చేతిలో ఉన్న రివాల్వర్ ఎవరైనా చూస్తే బావుండ్ను. కానీ దురదృష్టవశాత్తూ ఆ సినిమాకి తను తప్ప జనమెవరూ రాలేదు. ఈ నూట పదకొండు కూడా 'ఎలిబీ' కోసం టికెట్ కొన్నాడేమో సినిమా చూడ్డానికి రాడేమో?

అతను నల్ల అంబాసిడర్ డోర్ తెరుస్తుండగా "ఆగండి" అని వినిపించింది.

యుగంధర్ ఆగి అటు చూసాడు. పక్కనున్న అమ్మాయికూడా కోపంగా చూసింది. టికెట్లు ఇచ్చే క్లర్క్ పరిగెత్తుకొస్తున్నాడు, "దయచేసి మీ డబ్బులు వాపస్ తీసేసుకోండి సార్. ఇద్దరే టికెట్టు కొనడం వలన షో రద్దు చెయ్యమని ఓనర్ గారు ఫోన్ చేసారు" అన్నాడు.

యుగంధర్ "మరి ఇంకో టికెట్ కొన్న వ్యక్తికి ఇచ్చారా?" అడిగాడు.

"అతని సంగతి నీకెందుకు ముందు నువ్వు డబ్బులు తీస్కో" పక్కనున్న అమ్మాయి గదమాయించింది.

ఖచ్చితంగా తను చూసిన డిక్కీలో శవానికీ, ఈ నూటపదకొండుకీ, పక్కనున్న సిల్క్ చీర అమ్మాయికీ సంబంధం ఉందని అతనికి అర్ధమయింది. డబ్బులు తీసుకునే నెపంతో చెయ్యెత్తినట్లు చేసి, మెరుపు వేగంతో ఆ అమ్మాయిని ఈడ్చి కొట్టాడు.

ఆమె కింద పడింది.

"వెల్ డన్ యుగంధర్.. వీళ్ళే ప్రభుత్వ రహస్యాలు ఫరిస్తాన్‌కి అమ్మేస్తున్న ముఠా. ఆ నూట పదకొండుని కూడా సందు చివర 'ఇచ్చట మూత్రం విసర్జించరాదు' అన్న చోట మూత్రవిసర్జన చెయ్యబోతే మా కానిస్టేబుల్ పట్టుకుని నాకు ఫోన్ చేసాడు." అంటూ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు వచ్చాడు. ఆమెని కస్టడీలోకి తీసుకున్నారు.

"కానీ ప్రొద్దుటనగా టీ పెట్టడానికి పాలు తీసుకురాడానికి వెళ్ళిన నా అసిస్టెంట్ రాజు ఏడి?" అన్నాడు యుగంధర్ ఆత్రుతగా.

అప్పటిదాకా బఠానీలు అమ్మే కుర్రాడిలా అటూ ఇటూ తిరుగుతున్న రాజు, బుగ్గ మీద పెట్టుకున్న పులిపిటికాయ తీసేసి వచ్చి "మీరు ప్రమాదంలో ఉండడం చూసి, కారుని సైకిల్ మీద ఫాలో అవుదాం అనుకున్నాను సార్.. ఇంతలో ఇన్‌స్పెక్టర్ గారు వచ్చారు" అన్నాడు.

"మొత్తానికి 111 ఆట కట్టింది. కాదు కాదు మూడు ఒకట్లు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు.

●●●

*మా గురువుగారు యండమూరి వీరేంద్రనాథ్ గారు రాస్తే...*

*చీకట్లో కన్నెపిల్ల*

నిద్రపోయే థియేటర్, లేచే సైకిల్ ధూళి, బిచ్చగాడి పాట, చింపి పారేసిన కొత్త టిక్కెట్టు ముక్కలు, మారే సినిమా, ఊడే పోస్టరూ, ఒక వర్షపు చినుకు. అన్నీ అందంగా కనిపిస్తాయి. ప్రేమించటంలో ఎంత ఆనందం ఉంది!

ఆ అమ్మాయి భీతహరిణేక్షణలా సినిమా హాలు కౌంటర్ వైపు నడిచింది.

"ఒక టికెట్టు ఇవ్వండి" అంది. ఎవరైనా వేణువూదారా అని కౌంటర్‌లో వ్యక్తి ఒక్క క్షణం ఆశ్చర్యంగా చూసాడు.

"ఒక టికెట్టు.." ఆమె మళ్ళీ అడగడంతో అది వేణు స్వరం కాదు ఈ అలివేణి స్వరం అని అతనికి అర్థమైంది.

అతను టికెట్టు చించి ఇచ్చి డబ్బులు తీసుకోవడం కూడా మరిచిపోయి ఆమెని చూస్తుండిపోయాడు.

"డబ్బులు తీస్కోండి" ఆమె యాభై రూపాయల నోటు అతని వైపు తోసి, వెనక్కి తిరిగి నడిచింది.

ఆడపిల్లకి ఒద్దిక నేర్పాల్సిన చీర కొంగు, ఆమెని చూసి ఒద్దిక నేర్చుకున్నట్లు అణుకువగా ఒదిగి ఆమె అందాలని కప్పినా, ఆ ఆకర్షణకి తనూ ఎర అయినట్లు రెపరెపలాడ్తోంది.

ఒంటరిగా సినిమా హాలుకి వచ్చి టికెట్టు కొన్న ఆడపిల్లని, అదీ సెన్సార్ వారు 'ఏ' సర్టిఫికెట్ ఇవ్వకపోయినా, ఒంటరిగా రావడానికి ఆడపిల్లలు భయపడే తెలుగు సినిమాకి ఆమె రావడం, ఒక్కత్తే నిలబడి ఉండడం కౌంటర్లో క్లర్క్‌కీ, గేటు దగ్గర కుర్రాడికీ కూడా ఆశ్చర్యం వేసింది. పోనీ ఎవరికోసమైనా ఎదురు చూస్తోందా అంటే, ఒక్క టికెట్టే కొంది.

జేమ్స్ బైక్ పార్క్ చేసి, వేగంగా నడుస్తూ థియేటర్లోకి వచ్చాడు. అతను కౌంటర్ దగ్గరకి వెళ్ళేటప్పుడు ఆమె పక్కనుండే వెళ్ళాడు. కానీ ఆమెని గమనించలేదు.

అతను కౌంటర్లోకి వంద రూపాయల నోటు అందిస్తూ "ఒకటి" అన్నాడు. ఆ అనడంలో ఎంతో నిర్లక్ష్యం ఉంది. కానీ అతని మనసులో అతి గొప్ప లక్ష్యం ఉంది.

క్లర్క్ అందించిన చిల్లరా, టిక్కెట్టూ తీసుకుని "థాంక్స్" అన్నాడు. అతను చెయ్యాల్సిన పని అతను చేసాడు. "థాంక్స్" ఎందుకు చెప్పాలి అని జేమ్స్ అనుకోడు. అది అతనికి జన్మతహా వచ్చిన సంస్కారం. ప్రస్తుతం అతను ఒంటరితనం కోరుకుంటున్నాడు. జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి సిగరెట్ అంటించుకుని, లైటర్ మళ్ళీ జేబులో పెట్టేసి, ప్యాంట్ బ్యాక్ పాకెట్ లోంచి ఒక కాయితం తీసి చదవడం మొదలు పెట్టాడు.

"డియర్ జేమ్స్,

నా అభిప్రాయాలు ఎదురుగా కూర్చుని చెప్పవచ్చుకానీ ఇంగ్లిషులో 'కీట్స్' అనే కవి 'నీ పెదవి మౌనంగా ఉండి, నీ గుండె మాత్రం కేక పెడ్తే అది విని భరించే శక్తి ఎదుటి వారికి ఉండదు' అని ఎక్కడో రాసాడుట. 'ఆంత్రోపాలజీ గురించి నీ అంతకాకపోయినా అంతో ఇంతో తెలిసిన నేను నీ ఎదురుగా కూర్చుని నా వాదనని వినిపించదలచుకోలేదు. ఎవరి అసంతృప్తులని వారే భరిస్తూ కేవలం శారీరక అవసరం కోసం ఒక కప్పు కింద కలిసి ఉండడాన్ని వివాహం అంటుంది ఈ లోకం. మనం ఎవరిళ్ళల్లో వాళ్ళం ఉండి, కేవలం మన జీవితాల్లోని అసంతృప్తులని పారద్రోలుకోడానికి వారానికి ఓ గంటో, పూటో కలిసి ఉండడాన్ని అనైతికం అంటుంది ఈ సంఘం.

ఒక భర్త చావు బతుకుల్లో ఉంటే, ఆఖరి క్షణాలని తెలిసి కూడా భార్య రాలేదంటే, అతని బ్యాంక్‌లో ఆమెకి కావలసినంత బాలెన్స్ పెంచుకోలేకపోవడమే కారణం అంటావు నువ్వు.

ఆమె హృదయపు ప్రేమ అకౌంట్లో డెబిట్లే తప్ప క్రెడిట్లు పెంచలేక పోవడము అతడి తప్పంటాను నేను.

ప్రపంచంలో అన్నీ ఆర్థిక సంబంధాలే అని వాదించే నీతో 'నా ఖర్చుతో' నా స్కూటీ మీద నీఫ్లాట్ కొచ్చి నేను గడిపే గంటకి ఎంత ఖరీదు కట్టమంటావ్?' అని నేను అడిగితే నీ దగ్గర జవాబు ఉండదు.

కొనుక్కున్నవాడు సెల్ ఫోను వాడే తీరుకీ, 'ఒక్క కాల్ చేసుకుని ఇస్తా' అని అడుక్కుని ఫోన్ చేస్కునే వాడికీ వాడకంలో ఉన్న తేడాని నేను పెళ్ళికీ, ప్రేమకీ అన్వయించగలను. అసలే నాది ముప్పై రెండు వేలు పెట్టి కొనుక్కున్న కాస్లీ ఫోన్.

నీకీ ఉత్తరం అర్థం అవుతుందని నేను అనుకోవటం లేదు. అర్థం అయితే మాత్రం దాచిపెట్టు. ఇంకో అమ్మాయి కలిసినప్పుడు నువ్వు ఈ ఉత్తరంలోని వాక్యాలు చెపితే, ఆమె నీ తెలివిని గురించి గొప్పగా భావిస్తుంది. ఒక స్నేహితురాలిగా ఇంతకాలం కలిసి ఉన్నందుకు నేను ఇస్తున్న బహుమతి అనుకో...

**నీ చీకట్లో కన్నెపిల్ల.**

ఎన్నిసార్లు చదివినా జేమ్స్‌కి అర్థం కావడంలేదు. ఫ్రాయిడో ఆల్ఫ్రెడ్ హిచ్ కాకో కానీ మనసు గజిబిజిగా ఉన్నప్పుడు అర్థం కాని భాషలో సినిమాలు చూడమన్నాడు. అందుకే జేమ్స్ ఈ థియేటర్ కొచ్చాడు.

అతనికి కాస్త దూరంలో నిలబడ్డ పరిమళ ఆలోచిస్తోంది, 'సోమసుందరం నిజంగా వస్తాడా?' అతనొస్తే కనుక ఇంటర్వెల్‌లో 'పూజా మీ నాయనమ్మకి ఒంట్లో బాలేదు బయటికిరా' అని స్లయిడ్ వేయిస్తాడు. మళ్ళీ ఈ రోజు రాత్రి కల్లా అతను పాలస్తీనా సరిహద్దుల్లోకి ప్రయాణం అవ్వాలి.

పాలస్తీనా సరిహద్దుల్లోకి సోమ సుందరం ఎందుకెళ్ళాలీ అంటే.. సరిగ్గా 24 గంటలు వెనక్కి వెళ్ళాలి.

అసమాలాడుద్దీన్ సోమసుందరం వైపు రెప్పవాల్చకుండా చూసాడు. కాసేపాగి, "ఎందుకింత తెగించావు?" అన్నాడు.

"నాకు రోజూ అన్నం పెట్టే సులేమాన్‌ని చంపావ్. పట్టెడన్నం కోసం వలస వచ్చి, రాత్రీ పగలూ నాకు వంట చేసి పెడ్తూ ఉండే సులేమాన్ ప్రార్థనా మందిరానికి వెళ్ళి వస్తూ ఇడ్లీలో చట్నీ కోసం తన ప్రియ స్నేహితుడు సుబ్రహ్మణ్య శాస్త్రి ఇచ్చే కొబ్బరి చిప్ప కోసం రాజరాజేశ్వరీ ఆలయం దగ్గర ఆగాడు. అదే అతను చేసిన నేరమా? అభం శుభం తెలీని సులేమాన్‌నీ, శాస్త్రినీ, అక్కడకొచ్చిన వేలాది అమాయకుల్నీ నువ్వు బాంబుతో పొట్టన పెట్టుకున్నావు. ఇలా అని తెలిస్తే నేను అసలు కొబ్బరి చట్నీనే మానేసేవాడిని. లేకపోతే ఫ్రీగా తెస్తాడని ఆశపడకుండా డబ్బులిచ్చి కొబ్బరికాయని కొనేవాడిని" అన్నాడు.

ఆకాశం రెండుగా విరిగినట్టు ఫెళఫెళ శబ్దం. క్షణంలో వెయ్యోవంతు సేపు అసామా మొహంలో వెలుగు.

"అయితే నువ్వు నా దగ్గర బందీగా ఉన్న మీ రక్షణ శాఖ సైనికాధికారి ప్రతాపరుద్ర కోసం రాలేదా?" అన్నాడు.

"అతనెవరో నాకు తెలీదు"

"అయితే ఇప్పుడు తెలిసిందిగా! అతని పోలికలు పుణికి పుచ్చుకున్నట్టుగా ఉన్న నువ్వు అతని స్థానంలో మీ రక్షణ శాఖ రహస్య స్థావరంలోకి ప్రవేశించాలి. అతనిలాగే నటిస్తూ మీ మిలిట్రీ సీక్రెట్స్ మాకు అందించాలి లేదా.."

"లేదా?"

"నీ పరిమళ నీకు దక్కదు."

ఆ మాటకి అదిరిపడ్డాడు సోమసుందరం..

"పరిమళ నీకు తెలుసా?"

"ఆమె ప్రస్తుతం భీమవరంలో ఒక తెలుగు సినిమా విడుదల రోజున ఉదయం ఆట సినిమాకి వెళ్ళింది"

"నో!" అరిచాడు. అతని దవడ కండరం బిగుసుకుంది.

పరిమళ తనను మోసం చేసింది.

తెలుగు సినిమాలు చూడననీ, చూస్తూ మధ్యలో ఈలవేస్తూ, కాయితాలు చింపి హీరో రాగానే తెరమీద విసిరే అన్ ప్రొడక్టివ్ పనులు చెయ్యననీ తనకి మాటిచ్చిన పరిమళ తనని మళ్ళీ మోసం చేసింది.

కానీ ఆమెని కాపాడుకోవాలి. కేవలం కొన్ని నిమిషాలే వ్యవధి ఉంది. తను ఇక్కడ చచ్చిన కళేబరాలూ, రాబందుల మధ్య. అక్కడ పరిమళ బతికిన శరీరాలూ, చస్తున్న మనసులతో సీట్లకి అతుక్కుపోయిన మనుషుల మధ్య.. ఎలా?.. **ఎలా? ఎలా?**

●●●

జేమ్స్, పరిమళా ఒకేసారి కౌంటర్ దగ్గరకొచ్చారు.

"ఆట ఎప్పుడు మొదలౌతుంది?"

మొదట అతడే అడిగాడో, లేక ఆమే అడిగిందో తెలీదు. కానీ ఇద్దరూ అడిగారు.

క్లర్క్ ఒక వంద రూపాయల నోటు ఇద్దరి వైపూ జరిపి "సారీ ఈ ఆట మొదలవదు. ఇద్దరి కోసం సినిమా వెయ్యలేము" అన్నాడు.

పరిమళ జేమ్స్ వైపు చూసింది.

జేమ్స్ పరిమళవైపు చూశాడు.

చీకట్లో కన్నెపిల్ల అతని మస్తిష్కంలో చెరిగిపోతోంది.

పరిమళకి సోమసుందరం కూడా!

ఎవరి కోసమో టికెట్టు కొంటావు.

ఇంకెవరికోసమో టికెట్ చింపేస్తావు.

ప్రేమ ఫలిస్తే ఫేస్ బుక్‌లో 'ఎంగేజ్డ్' అని స్టాటస్ పెడ్తావు. లేదా 'ఇంట్రెస్టెడ్ ఇన్ అపోజిట్ జెండర్' అని స్టాటస్ మారుస్తావు.

●●●

*<u>ఆహ్లాద అభిమాన రచయిత మల్లాది వేంకట కృష్ణమూర్తిగారైతే ఇలా రాస్తారు...</u>*

*<u>వంటబ్బాయ్</u>*

ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో లేబర్ రూం దగ్గర గడియారం రాత్రి పన్నెండుగంటలు కొట్టింది. డ్యూటీలో ఉన్న నర్స్ పంకజం నిద్రాభంగమై విసుగ్గా తల ఎత్తి చూసింది.

బయట ఒక స్త్రీ ప్రసవ వేదన తాలుకూ అరుపులు వినపడ్డాయి.

"మాయిదారి గోల, టైమూ పాడూ ఉండదు" అని విసుక్కుంటూ లేచి వెళ్ళింది.

స్ట్రెచర్ మీద ఒక అమ్మాయిని తీసుకొచ్చారు.

"పేషెంట్ పేరు?"

"తెలీదు"

"భర్త పేరు? "

"తెలీదు"

పంకజం విసుగ్గా పేషెంట్ తాలుకు అతన్ని చూసింది.

"ఈ అమ్మాయితో నాకు ఎటువంటి సంబంధం లేదు. రోడ్డు పక్కన ప్రసవ వేదన పడ్తుంటే తెచ్చాను." అన్నాడు ఆ పక్కనున్నతను.

"అలా అయితే ఎడ్మిట్ చేసుకోవడం కుదరదు" పంకజం చెప్పేసింది.

"ఆ!" అన్న అరుపు, వెనకాలే 'కేర్' మన్న పసిబిడ్డ అరుపూ వినిపించాయి.

పంకజం పేషెంట్ దగ్గరకి వెళ్ళి "ఏమ్మా కాస్త ఆగలేవూ?" అంది.

పేషెంట్ కళ్ళు మూసుకుని తల పక్కకి వాల్చేసింది ఉంది. ఆమె పక్కనే హాండ్ బ్యాగ్ ఉండడం చూసి "ఇందులో ఆమె డీటైల్స్ ఉన్నాయేమో చూడండి.. ఆమె చనిపోయింది" అన్నాడు పేషెంట్‌ని తెచ్చిన అతను.

పంకజం బ్యాగ్ తెరిస్తే, ఒక వంద రూపాయలనోటూ, హేండ్ కర్చీఫ్, పిన్నీసుల గుత్తీ, పొట్లాల దారం ఉండా, చిన్న డైరీ కనిపించాయి. ఆమె పొట్లాల దారం ఉండ చేతిలోకి తీసుకుని చూసి 'ఈ అమ్మాయి బ్యూటీషియన్ అయి ఉంటుంది' అనుకుంది. డైరీలో పేజీలు తిరగేస్తోంది. "అతను బాబుకి తండ్రని అతనికి కూడా తెలీదు. 'గబ్బర్ సింగ్' రిలీజ్ రోజున మేం కలుసుకున్నాం. సెకండ్ షో చూసి అతని రూంకెళ్ళాం. ఏ అనువాద చిత్రం, రీమేక్ చిత్రం, అయినా అతను రిలీజ్ రోజు మార్నింగ్ షో తప్పక చూస్తాననీ ఈ రోజు మాత్రం మిస్ అయిందనీ బాధపడ్డాడు." అని రాసి ఉంది.

పేషెంట్‌ని తెచ్చిన అతను కూడా అది చదివాడు.

అతనే వంటబ్బాయ్. ప్రస్తుతం కాలం కలిసి రాక వంటలు చేసుకుని బతుకుతున్నా తను గొప్ప డిటెక్టివ్‌ని అవుతానని అతని నమ్మకం.

'ఈ బిడ్డకి తండ్రెవరో నేను తెలుసుకుంటా' అనుకున్నాడు.

పంకజం ఈ విషయం డ్యూటీ డాక్టర్‌కి ఫోన్ చేసింది.

"విజిటర్స్ బుక్ లో ఎంటర్ చేసావా?" అడిగాడు డాక్టర్ అవతల నుండి.

ఏ గవర్నమెంట్ ఆసుపత్రిలో అయిన ప్రతి వింగ్‌కీ ఒక చీఫ్ డాక్టరూ, అతనికి అసిస్టెంట్ డాక్టర్లూ ఉంటారు. వీళ్ళు కాక ఇన్‌టర్న్లు కూడా ఉంటారు. హౌస్ సర్జన్సీ చేస్తున్న వీళ్ళు ఆపరేషన్స్ లాంటివి చెయ్యకూడదు కానీ ఎమర్జెన్సీ కేసులు అటెండ్ అవ్వచ్చు. డ్యూటీ నర్సులకీ, నర్స్ ట్రైనింగ్ అవుతున్న స్టూడెంట్స్‌కీ కూడా ప్రత్యేకమైన డ్యూటీలుంటాయి. కానీ టైం దొరికినప్పుడు రిలాక్స్ అవడానికి  ఒకటే మంచం ఉంటుంది. అప్పుడప్పుడూ కెఫెటేరియా నుండి టీ తేడానికి ఒక కుర్రాడు వస్తూ ఉంటాడు. మధ్యాహ్నం పూట టీతో పాటు బిస్కెట్లూ, సమోసాలూ కూడా తెస్తుంటాడు. బంగాళా దుంప కూర కాకుండా, కేవలం ఉల్లిపాయలూ, పుదీనాతో చేసిన చిన్న సమోసాలు కూడా తెస్తుంటాడు. పెద్ద సమోసా ఒకటి రూపాయి అరవై పైసలు అయితే చిన్న సమోసాలు రూపాయికి ఒకటి అమ్ముతుంటాడు.

ఈ కుర్రాడు కేవలం టీ, సమోసాలే కాకుండా అప్పుడప్పుడూ డాక్టర్లకి సిగరెట్లూ, నర్స్‌లకి ఇంకా అవసరమైనవీ కూడా రహస్యంగా అమ్ముతుంటాడు.

పంకజం ఆ కుర్రాడితో "టీతో బాటు బిస్కెట్స్ తేలేదా?" అని అడిగింది.

"తేలేదు. పేషెంట్స్ కిచ్చే బ్రెడ్ ఏం చేస్తున్నావ్?" అడిగాడు.

వాళ్ళు వాళ్ళ గొడవలో ఉండగా, వాళ్ళ గొడవలో వాళ్ళుండగా తన సెల్ ఫోన్‌తో చనిపోయిన అమ్మాయి ఫోటో తీసి డైరీ తన వంటబ్బాయ్ డయిరీ తన షర్ట్ జేబులో దాచేసుకుని బయట పడ్డాడు.

ఆ రోజు ఆ అనువాద చిత్రం రిలీజ్ అవుతుందని ముందే తెలిసిన వంటబ్బాయి, తాను వంట చేసే లాయర్ గారింట్లో వంట త్వరగా ముగించాడు. బ్రేక్ ఫాస్ట్‌కి చిటుకుల ఉప్మా చేసాడు. దీన్ని ఒరియా వాళ్ళు ఎక్కువగా చేస్తుంటారు. నానేసిన బఠానీలూ, బొబ్బర్లూ, సెనగ పప్పూ కలిపి తిరగమోతలో వేసి, పైన పచ్చి కొత్తిమీరా, టమోటా ముక్కలూ జల్లిన ఈ చిటుకుల ఉప్మా లాయర్ పార్థసారథి చాలా ఇష్టంగా తింటాడు.

ఆయన తింటుండగా వంటబ్బాయ్ "సినిమాకెళ్ళాలి సార్" అన్నాడు.

"మళ్ళీ అనువాద చిత్రమా? .. వెళ్ళు. కానీ నీ పరిశోధన ఎంతవరకూ వచ్చింది? ఎవరైనా ఆ రోజు రాత్రి ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో పోయిన అమ్మాయి తెలుసని చెప్పారా?" అడిగాడాయన.

"నా సెల్ ఫోన్‌లో రహస్యంగా తీసిన ఆమె ఫోటో చూపించి ఎవర్ని అడిగినా ఒకటే మాట సార్"

"ఏంటది?"

"తెలీదు కానీ ఇంట్రెస్టుంది అన్నారు సార్"

"హూ ! లోకం ఇలా ఉంది. ఏం చేస్తాం? కానీ నిజానికి ఆ అమ్మాయి చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది" అన్నాడాయన.

పార్థసారథికి భోజనం టేబుల్ మీద పెట్టేసి వంటబ్బాయి సినిమాకి బయలుదేరాడు.

వై.ఎం.సి.ఎ నుండి స్ట్రెయిట్‌గా వెళ్ళి సుల్తాన్ బజార్ వైపుగా కాకుండా రైట్‌కి తిరిగితే రాంకోటీ చౌరస్తా వస్తుంది. అటునుండి తిన్నగా ఇరుకు సందుల గుండా వెళితే ఇదివరకు రాయల్ టాకీస్ వచ్చేది. ఇప్పుడు అక్కడికి కాస్త దూరంలో కట్టిన తార టాకీస్‌కి ఆటోలో చేరుకున్నాడు వంటబ్బాయి

టికెట్ కౌంటరు వెలవెల బోతోంది. అది అతనికి అలవాటే. వెళ్ళగానే టికెట్ కొనుక్కోకుండా, కొనడానికొచ్చే మిగతావాళ్ళ కోసం చూస్తున్నాడు.

ఒక వయసు మళ్ళినావిడ వచ్చి కౌంటర్లోకి ఒంగి "వయసుకొచ్చాం సినిమానేనా బాబూ?" అడిగింది.

"కాదు. నీ వయసుకి వయసు కొచ్చాం సినిమా కొచ్చావా?" టికెట్లు ఇచ్చే క్లర్క్ చిరాకు పడ్డాడు.

ఆవిడ సినిమా పేరు అడిగి తెలుసుకుని "ఇట్టాంటివి చూడ్డానికి డబ్బు లెందుకు దండగ చెయ్యడం.. టీ.వీ లో చూడచ్చు" అని వెళ్ళిపోయింది. వంటబ్బాయి ఒక తమిళ న్యూస్ పేపర్ కొని చూస్తూ అక్కడికి దగ్గర్లో నిలబడ్డాడు. అతనికి తమిళం వచ్చని కాదు, తమిళుడు అనుకుని తెలుగులో అతని ముందు ఇతరులు నిర్భయంగా మాట్లాడుకుంటారనీ. ఇలాంటి తెలివైన ఆలోచనలు ఉండబట్టే తను గొప్ప డిటెక్టివ్‌ని కాగలనని అతని ప్రగాఢ నమ్మకం.

ఇంకో ఇద్దరు అమ్మాయిలొచ్చారు. ఇరవయి ఏళ్ళలోపే ఉండచ్చు. కౌంటర్ వైపు వెళ్తూ ఆగి "అయ్యో 'యూ' సర్టిఫికెట్ ట.. ఏం చూస్తాం? పద.. ఇంకో సినిమాకి వెళ్దాం" అని వెళ్ళిపోయారు.

ఈసారి గెడ్డం మాసిన ఒక నడివయసు వ్యక్తి వచ్చాడు.

కౌంటర్లోకి ఒంగి ఏవీ అడక్కుండా టికెట్ కొన్నాడు.

వంటబ్బాయి అతని వెనకాలే వెళ్ళి తనూ టికెట్ కొన్నాడు.

గెడ్డం మాసిన అతన్ని ఫాలో అయ్యాడు. అతను గేట్ వద్ద పాన్ షాపు దగ్గర కెళ్ళి సిగరెట్ కొని వెలిగించాడు.

'ఇతను వ్యసనపరుడే' అనుకున్నాడు వంటబ్బాయి. అతని పక్కకెళ్ళి మాటలు కలిపాడు. "సినిమాకి ఎవరూ వచ్చినట్లు లేరు" అతను చిరాగ్గా తలఊపాడు.

"దీని గురించి టీ.వీ.లో విని వచ్చారా?"

"బీవీతో పడకొచ్చాను"

"ఆ?"

"అవును.. సెలవురోజు ఇంట్లో దొరికాను కదా అని నా పెళ్ళాం కాల్చుకు తింటోంది. ఇంక పిల్ల వెధవలైతే కాసేపు కూడా ప్రశాంతంగా పడుకోనివ్వరు. ఆఫీసే నయం బాస్ వెధవ లేనప్పుడు పడుకుని చావచ్చు. ఇక్కడైతే ఈ దిక్కుమాలిన సినిమాకి ఎవరూ రారు. ఏ.సీ వేసి తగలడ్తాడు కాబట్టి నిద్రపోయి చావచ్చని వచ్చా. మీరూ టికెట్టు కొన్నారా?"

వంటబ్బాయి తలూపాడు.

"అయితే వేరే రోలో, కనీసం నాలుగు రోల అవతల కూర్చుని చావండి. నాకు గట్టిగా మాట్లాడినా, నవ్వినా, చప్పట్లు కొట్టినా చంపేద్దామన్నంత కోపం వస్తుంది" అతను పళ్ళు కొరికి చెప్పాడు.

"అయితే మీరు అనువాద చిత్రాలంటే ప్రేమతో రాలేదా?" నసిగాడు వంటబ్బాయి.

నీ శ్రాద్ధం. "అలాంటి ఇష్టాలేమీ లేవు"

"ఈ అమ్మాయిని ఎక్కడైనా చూసారా?" జేబులోంచి వంటబ్బాయి ఫొటో తీసి చూపించాడు.

"ఇదా నీ వ్యాపారం? చూడ్డానికి పెద్ద మనిషిలా ఉన్నావ్.. పోలీసులకి ఒప్పచెప్తాను ఏం అనుకున్నావో" అతను మండిపడ్డాడు.

"ఆ..ఆ.. నేను డిటెక్టివ్‌ని అందుకే అడిగాను." అని చెపుతున్న వంటబ్బాయి మాట వినిపించుకోకుండా ఇంట్లో పెళ్ళాం మీద కోపం అంతా చూపిస్తూ బూతులు తిట్టడం మొదలు పెట్టాడు.

ఈలోగా బుక్కింగ్ క్లర్క్ వచ్చి "హమ్మయ్యా.. ఇద్దరూ ఇక్కడే ఉన్నారా? ఇద్దరికే సినిమా వెయ్యడం కుదరదు కానీ కౌంటర్ దగ్గర కొచ్చి మీ డబ్బులు వెనక్కి తీసుకెళ్ళండి" అన్నాడు.

"నేను చచ్చినా తీసుకోను. నాకు ఒక్కడికైనా సినిమా ఆట వెయ్యాల్సిందే ఇంట్లో చావలేక థియేటర్ కొస్తే ఆటలుగాఉందా?"

"అయ్యా! అర్థం చేసుకోండి రీల్ రాలేదు."

"రీల్ ఎవడిక్కావాలయ్యా? నాకు ఏ.సీ వెయ్యి చాలు"

వాళ్ళు పోట్లాటలో ఉండగానే వంటబ్బాయి అక్కడినుండి ఉస్సూరు మంటూ ఫోటో పట్టుకుని ఇంకో హాల్ వైపు బయలుదేరాడు.

*అన్నీ కేవలం కల్పితం.. నా అభిమాన రచయితల మీద ఇష్టం కథల్లో చూపించడానికి హాస్యంగా చేసిన ప్రయత్నం.*

●●●

Click here to share your comments on this story.

